

నేడు సీఎం రాక

- నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో పర్యటన
- బిజినేపల్లి సభకు జన సమీకరణ కోసం కసరత్తు
- మద్దూరులో పార్టీ కార్యకర్తలతో సమావేశం..
- కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో బావోజీ దర్శనం



బిజినేపల్లిలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లు రవి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/మద్దూరు/కోస్గి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో బహిరంగ సభలో, నారాయణపేట జిల్లా మద్దూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడంతో పాటు కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో బావోజీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొననున్నారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి నాగర్‌కర్నూల్ జిల్లాకు వస్తున్న రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఐదుగురు ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యారు. సన్నిహితుడైన మల్లురవి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొననున్న ఆయన సెంటిమెంట్ ప్రకారం బిజినేపల్లి బహిరంగ సభలో మాట్లాడనున్నారు. అందుకోసం బిజినేపల్లి నుంచి వనపర్తి వెళ్లే రోడ్డు పక్కన 12 ఎకరాల్లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ను దారి మళ్లించనున్నారు. ఎస్పీతోపాటు దాదాపు వెయ్యి మంది పోలీస్ ఉన్నతాధికారులు సీఎం భద్రత కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

మద్దూరులో పర్యటన


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేట జిల్లా మద్దూర్ గ్రీన్ ప్యాలెస్‌లో మంగళవారం నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగనుంది. అదేవిధంగా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో జరిగే గిరిజనుల ఆరాధ్యదైవం బావోజీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, స్వామిని దర్శించుకోనున్నట్లు పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల సమావేశం జరిగే గ్రీన్ ప్యాలెస్‌ను తిరుపతిరెడ్డి సోమవారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కూడా ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది.

లింగమయ్యా.. వస్తున్నాం

- ప్రారంభమైన సలేశ్వరం ఉత్సవాలు
- తరలొస్తున్న భక్తులు
- 250 మంది పోలీసులతో భద్రత



లింగమయ్య దర్శనం కోసం వస్తున్న భక్తులు



గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట, ఏప్రిల్ 22: నల్లమల అభయారణ్యంలో వెలసిన సలేశ్వరం లింగమయ్య జాతర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. భానుడి భగభగతో మొదటి రోజు భక్తుల తాకిడి కొంత తక్కువగా కనిపించింది. అయితే సాయంత్రం నుంచి అన్ని దారులు సలేశ్వరం వైపే సాగాయి. మోకాళ్ల కురువ నుంచి నడక దారుల్లో మధ్యాహ్నం భక్తులు కొంత తక్కువగా ఉండగా.. సాయంత్రం జన సంద్రంగా మారాయి. ఏడాదికి ఒక్కసారి నిర్వహించే ఈ ఉత్సవాల్లో లింగమయ్యను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక నుంచీ భక్తులు తరలి రానున్నారు. స్వామివారి దర్శనం కోసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పడుతుంది. మంగళవారం పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు పోలీస్, అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు దాహార్తి తీర్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత ఆధ్వర్యంలో 20 ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నారు. మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ నిషేధించి, పరిసరాలు అపరిశుభ్రం కాకుండా అటవీ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తోంది. డీఎస్పీ శ్రీనివాసులు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 250 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.



లింగమయ్య స్వామి

భక్తులకు అన్నదానం

లింగమయ్య దర్శనం కోసం తరలివస్తున్న భక్తులకు లింగమయ్య భక్తులు, స్వచ్ఛంద సంస్థలు మొకాళ్లకుర్వ సమీపంలో అన్నదానం, మంచి నీటి సరఫరా చేస్తున్నారు. పుచ్చకాయ, అంబలి అందిస్తున్నారు. వారు చేస్తున్న సేవను అభినందిస్తూ.. తెచిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.



గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు



కొనుగోలు చేయకపోవడంతో ఇటిక్యాల మండలం జింకలపల్లి కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు

ధాన్యం కొంటలేరు

- ప్రభుత్వ కేంద్రాల్లో ప్రారంభించని కొనుగోళ్లు
- రైస్ మిల్లులను కేటాయించక పోవడమే కారణం
- గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు
- అక్కడ కూడా లభించని మద్దతు ధర
- అధికంగా రాయచూర్ మార్కెట్‌కు తరలింపు

గద్వాల, ఏప్రిల్ 22: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రైతులు నష్టపోతున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు ధాన్యం తరలించడానికి మిల్లులను కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో రైతులు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. దాంతో అక్కడ వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 67 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 20 రోజులు గడుస్తున్నా.. ఒక్క క్వింటాలు కూడా కొనలేదు.

50,600 ఎకరాల్లో సాగు

జిల్లాలో 50,600 ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో ఎక్కువ భాగం ధరూర్ మండలంలోనే సాగు చేశారు. ఇక్కడ జూరాల బ్యాక్ వాటర్, గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్ల నీటిని ఉపయోగించి దాదాపు 22 వేల ఎకరాల్లో వరి నాటారు. కేటీదొడ్డిలో 9,650 ఎకరాల్లో వరి నాటగా, గట్టులో 9,312, గద్వాలలో 5,421, మల్దకల్‌లో 2,119 ఎకరాల్లో సాగు చేశారు. మిలింది ఇతర ప్రాంతాల్లో నాటారు. అయితే వ్యవసాయ అధికారులు ఈ నెల మూడో వారంలో 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే సగం ధాన్యం కోతకు రాగా.. అందులో సింహభాగం రాయిచూర్ మార్కెట్‌కు తరలిపోయింది.



తక్కువ ధరకు కొంటున్నరు..

కొనుగోలు కేంద్రాలు ఉన్నట్లు తెల్వదు. వ్యవసాయ మార్కెట్‌లో ధర ఎక్కువ వస్తుందని గద్వాలకు వచ్చాను. కానీ ఇక్కడ మద్దతు ధర రూ.2,203 కంటే తక్కువకు కొంటున్నరు. సన్న రకాలను కూడా తక్కువ ధరకు కొనడం చూస్తే వ్యాపారులు సిండికేటు అయ్యిండ్రని తెలుస్తుంది.

- మారెప్ప, రైతు, తాటికుంట, మల్దకల్ మండలం



కేంద్రాలు తెరిచినట్లు తెల్వదు

సన్న రకాలకు మార్కెట్‌లో ఎక్కువ ధర వస్తుందని గద్వాలకు తెచ్చాను. కానీ క్వింటాలు 1,966లకే తీసుకున్నరు. మద్దతు ధరకంటే తక్కువకు కొంటున్నరు. అధికారులు ఏమి అంటలేరు. గత్యంతరం లేక మేము వచ్చిన కాడికి అమ్ముకుంటున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరిచినట్లు మాకు తెల్వదు. తెలిస్తే అక్కడే అమ్మేవాడిని.

- అంజనేయులు, రైతు, మద్దెలబండ

సన్నరకాలు సాగు చేయడంతో...

రైతులు ఎక్కువగా సన్న రకాలు సాగు చేశారు. ప్రస్తుతం ఈ రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉంది. రాయిచూర్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.2,700 నుంచి రూ.2,800 వరకు ధర పలుకుతుంది. కానీ గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో కనిష్ఠంగా రూ.1,500 నుంచి గరిష్ఠంగా రూ.2,500 వరకు ధర ఉంది. ఈ నెల ఒకటో తేదీ నుంచి మార్కెట్‌కు ధాన్యం వస్తుండగా.. ఆరో తేదీ నుంచి రోజూ రెండు వేల క్వింటాళ్ల నుంచి నాలుగు వేల క్వింటాళ్ల వరకు వస్తోంది. అయితే రెండు మూడు లాట్లకు మద్దతు ధరకు మించి ధర కోట్ చేస్తుండగా.. మిగిలిన లాట్లకు మద్దతు ధరకంటే తక్కువ కోట్ చేస్తున్నారు. దాంతో క్వింటాలుకు రూ.300 నుంచి రూ.500 వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో మార్కెట్‌కు తెచ్చి నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మద్దతు ధర వచ్చేలా అధికారులు చూడాలని రైతులు విన్నవిస్తున్నారు.

రాయిచూర్, గద్వాల మార్కెట్‌లకు తరలింపు..

జిల్లాలోని ఇటిక్యాల మండలం జింకలపల్లి, తిమ్మాపూర్, గద్వాల మండలం బీరెల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చింది. కానీ కొనుగోలు చేయకపోవడంతో వచ్చిన ధాన్యాన్ని రైతులు వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అందులో సింహభాగం రాయిచూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాలకు చెందిన ధాన్యం ఎక్కువగా రాయిచూర్ మార్కెట్‌కు తరలిపోతోంది. గద్వాల, మల్దకల్, ఇటిక్యాల మండలాలకు చెందిన ధాన్యం గద్వాలకు వస్తోంది. అయితే రాయిచూర్‌లో ఉన్న ధర గద్వాలలో లేదు.



గద్వాల మార్కెట్‌లో కోట్ చేసిన ధాన్యం

ఒక మిల్లుకు అగ్రిమెంటు చేశాము

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. వచ్చినట్లుగా డీఆర్‌డీఏ అధికారులు తెలపలేదు. అందుకే జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క క్వింటాలు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. సోమవారం ఒక మిల్లుకు సంబంధించిన అగ్రిమెంటును పూర్తి చేశాము. కొనుగోలు జరిగితే ఆ మిల్లుకు ధాన్యం పంపొచ్చు.

- విమల, జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారి, గద్వాల

యాదవులు అభివృద్ధికి బాటసారులు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ఊట్కూర్ మండలం పెద్దపొర్లలో నిర్వహించిన బండారు ఉత్సవంలో చిన్నారితో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కురువ, యాదవ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఊట్కూర్ మండలం పెద్దపొర్ల గ్రామంలో నిర్వహించిన కలిమెర లింగేశ్వర స్వామి బండారు ఉత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్ల, కురుమలతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అత్యధిక జనాభా కలిగిన కురువ, యాదవులతోపాటు ఇతర కులాలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని అన్నారు. అందుకోసం కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. కులగణన చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. సంప్రదాయ వృత్తిలో నైపుణ్య జీవితాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యం పొందిన కురువ, యాదవులు అన్ని రంగాల్లో రాణించి.. గొప్ప పేరు తేవాలని ఆకాంక్షించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో కురుమ, యాదవులను మభ్య పెట్టిందన్నారు. ఓట్లు దండుకోవాలని డీడీలు కట్టించుకుని మోసం చేస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం వెంటనే ఆ డీడీల సొమ్ము పూర్తి స్థాయిలో తిరిగి చెల్లించేందుకు కృషి చేస్తోందన్నారు.

అభివృద్ధి కోసం గెలిపించండి..

పదేండ్ల బీజేపీ, బీఆర్‌ఎస్‌ల నిర్లక్ష్యం నీడలో పాలమూరు ప్రాంతం మగ్గిపోయిందని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నేతృత్వంలో మాజీ సర్పంచ్ రవీంద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి వంశీచంద్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు గెలిచిన తర్వాత అభివృద్ధి కోసం పని చేయలేదని, కేవలం భూకబ్జాలు, దోపిడీ, అవినీతి అక్రమాలే చేశారని ఆరోపించారు. ఈ ప్రాంతాన్ని పదేళ్లు అణచివేసి.. రౌడీయిజం చేస్తూ లిక్కర్, కల్తీకల్లు ఏరులై పారించాయన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలతో ఆగమైన ప్రగతికి పునరుజ్జీవం పోసి.. అభివృద్ధివైపు అడుగులు వేసేందుకు తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణారెడ్డి, సిద్ధార్థ రెడ్డి, విఘ్నేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపొర్ల గ్రామంలో వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మిడ్జిల్, ఏప్రిల్ 22: అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలవబోమని ఆచరణకు సాధ్యం కాని హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక వాటిని ఎలా అమలు చేయాలో తెలియక నాయకులు తలలు పట్టుకుంటున్నారని బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్ల పట్టణంలోని చంద్రా గార్డెన్‌లో బీఆర్‌ఎస్ జడ్చర్ల మండలం, మునిసిపాలిటీ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశానికి అన్నం పెట్టేందుకు కృషి చేస్తే బీజేపీ వాళ్లు అక్షింతలు పంపి కుల మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన బియ్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర బీఆర్‌ఎస్ ఎంపీలంతా పీఎంను అభ్యర్థిస్తే నిర్ధాక్షిణ్యంగా తిరస్కరించిన చరిత్ర బీజేపీ వాళ్లదని మండిపడ్డారు. రాష్ట్రానికి చెందిన సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటులో కొట్లాడి నిధులను తేవాలంటే కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలంతా ప్రతీ ఇంటికి తిరిగి, ఆరు గ్యారెంటీలు అమలైతే కాంగ్రెస్‌కు, అమలు కాకుంటే బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని ప్రజలను కోరాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను కార్యకర్తలు ఎండగట్టాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఫోన్ చేసినా సాయం చేస్తా

- బీజేపీ అభ్యర్థి డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్(క్లాక్ టవర్), ఏప్రిల్ 22: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఏ అర్ధరాత్రి ఫోన్ చేసినా సహాయం అందించేందుకు మీ ముందుంటానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. నారీ శక్తి ఏంటో సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీలో గల కాళికాంబ కన్వెన్షన్ హాలులో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మహిళా మోర్చా కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి అరుణ హాజరై మాట్లాడుతూ ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు అనగా సరిగ్గా 22 రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ప్రతీ మహిళా మోర్చా సభ్యురాలు రోజు ఉదయం రెండు గంటలు, సాయంకాలం రెండు గంటలు ప్రజలతో మమేకమై.. నరేంద్ర మోదీ దేశం కోసం, మన, మన పిల్లల భవిష్యత్తు కోసం చేస్తున్న సేవలను, పథకాలను వివరించాలన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణం కేవలం నరేంద్ర మోదీ ద్వారానే సాధ్యమైందన్నారు. శత్రుదేశాల నుంచి మనం, మనదేశం సరక్షితంగా ఉండాలంటే తిరిగి నరేంద్ర మోదీని ప్రధాని కావాలన్నారు. ఈ ఎన్నికల్లో నేను గెలిస్తే మీరంతా గెలిచినట్లేనన్నారు. కల్వకుర్తి హుషారు పాలమూరు ప్రజలతో చూయించకని సీఎంను ఉద్దేశించి అన్నారు. అంతకు ముందు జైపాల్‌రెడ్డి, ఇప్పుడేమో అయన అల్లుడొచ్చాడని దుయ్యబట్టారు. తిడితే ఓట్లు పడతాయని అనుకోవడం రేవంత్ రెడ్డి భ్రమ అన్నారు. దేశంలో కాంగ్రెస్ లేదు.. ఇక్కడా కాంగ్రెస్ లేదన్నారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్క మహిళలకు ఉచిత బస్సు పథకం తప్ప మిగతావి ఏమయ్యాయని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా సీనియర్ నాయకులు నాగూరావు నామాజీ, శిల్పారెడ్డి, జయశ్రీ, పద్మవేణి, విజయ, నీలిమ, కౌసల్య, యాదమ్మ, సుజాత పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో
రూ.8,05,600 సీజ్
- ఎస్పీ రితిరాజ్


మోజర్ల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

గద్వాల క్రైం, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో, సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీస్ అధికారులు చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.8,05,600లను సీజ్ చేసి ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ రితిరాజ్ సోమవారం తెలిపారు. ఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గట్టు మండల కేంద్రంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.4 లక్షలు, బల్గెర చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.2.90 లక్షలు, అలాగే ఉండవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద రూ.58,100తో మొత్తం రూ.8,05,600 నగదు పట్టుబడిందన్నారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు.

పుల్లూరు టోల్ ప్లాజా వద్ద..

అలంపూర్ చౌరస్తా : ఉండవల్లి మండలం ఏపీ తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో రూ.115600లు నగదు పట్టుకున్నట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. నంద్యాలకు చెందిన మురళీధర్ సోమవారం కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా రూ.57,500లు నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదును గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.లక్షా ఇరవై వేలు పట్టివేత

పెద్దమందడి : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో వేర్వేరు చోట్ల చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.లక్షా 20 వేలు పట్టుకున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. సోమవారం మోజర్ల చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీలో బొలెరో వాహనంలో రూ.60 వేలు, మరో బొలెరో వాహనంలో రూ.60 వేలు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మానవపాడు, ఏప్రిల్ 22 : భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మానవపాడు మండలం పెద్దపోతులపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి పరుశరాముడుతో పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన సుకన్యకు పదేళ్ల కిందట వివాహమైంది. పెళ్లైన కొన్ని రోజులకు పరుశరాముడు తాగుడుకి బానిస కావడంతో అప్పులు పెరిగాయి. అప్పులు చెల్లించేందుకు పుట్టింటికి వెళ్లి డబ్బులు తేవాలని భార్యను వేధించాడు. ఉగాది పండుగ కోసమని సుకన్య పుట్టింటికి వెళ్లింది. ఈనెల 20న భార్యకు ఫోన్ చేసి అప్పులు కట్టేందుకు డబ్బులు తేవాలని బెదిరించాడు. దాంతో ఆ వేధింపులు భరించలేక ఆమె ఆ రోజు రాత్రి గుర్తు తెలియని మాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతోంది. బాధితురాలు సోమవారం ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు దర్యాప్తులో ఉంది.

తాగునీటి తిప్పలు తప్పేనా

- రామన్‌పాడు రిజర్వాయర్‌లో తగ్గిన నీటి నిల్వలు
- జూరాలలో డెడ్ స్టోరేజీ
- రామన్‌పాడు వద్ద మిషన్ భగీరథకు తాగునీరు
- ప్రాజెక్టును పరిశీలించిన పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ
- ఆల్మట్టి డ్యాం నుంచి నీరు వదిలితేనే గండం గడిచినట్లు

మదనాపురం, ఏప్రిల్ 22 : అసలే వేసవి కాలం. ఈ సంవత్సరం తగినంత వర్షాలు పడక ప్రాజెక్టులు, చెరువులు, నీటి కుంటలు, నిండలేదు. దీంతో బోర్లు ఎండిపోయాయి. గ్రామాల్లో కేవలం మిషన్ భగీరథ పథకం ద్వారానే తాగునీటిని అందిస్తున్నారు. అది కూడా నామమాత్రమే. చాలా గ్రామాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వనపర్తి జిల్లాకు తాగునీరు ఎక్కువగా రామన్‌పాడు రిజర్వాయర్ ద్వారానే అందుతుంది. అక్కడ వనపర్తి పంపుహౌజ్, అచ్చంపేట, ఆత్మకూర్ పంపుహౌజ్‌ల ద్వారా జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. రామన్‌పాడు రిజర్వాయర్ మొత్తం 22 ఫీట్ల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 10 ఫీట్ల నీరు మాత్రమే ఉంది. ఇంకా రెండు ఫీట్ల నీరు తగ్గితే పంపుహౌజ్‌కు నీరు అందక మూతబడుతాయి. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టులో 9.65 టీఎంసీలకు ప్రస్తుతం 2.88 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. రామన్‌పాడులో నీరు తగ్గినప్పుడు కొద్దిమేర నీటిని వదిలి బంద్ చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాల పరిస్థితి తెలుసుకోవడానికి ఈనెల 15న పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రామన్‌పాడు ప్రాజెక్టును పరిశీలించి, వివరాలు సేకరించారు. కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాం నుంచి నీటిని వదలాలని అక్కడి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసింది. వారు కరుణిస్తేనే జిల్లాకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఇప్పటికే రామన్‌పాడు ప్రాజెక్టు వద్ద ఆత్మకూర్ పంప్‌హౌజ్‌కు నీరు అందక కాల్వలు తీసి మోటార్ల సహాయంతో పంపుహౌజ్‌కు నీటిని అందిస్తున్నారు. రోజులు ఇలాగే గడిస్తే జిల్లాలోని అన్ని తాగునీటి పంపుహౌజ్‌లు మూతపడక తప్పని పరిస్థితి. అందిన సమాచారం మేరకు మే నెలలో ఆల్మట్టి నుంచి జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు కసరత్తులు మొదలు పెట్టినట్లు తెలిసింది.



వనపర్తి పంపుహౌజ్



రామన్‌పాడు ప్రాజెక్టు వద్ద అడుగంటిన నీరు



మోటార్ల ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం

ప్రస్తుతం తాగునీటికి ఇబ్బంది లేదు..



రామన్‌పాడు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10 ఫీట్ల మేర నీరు ఉంది. నీటి నిల్వ తగ్గినప్పుడు జూరాల నుంచి వదిలి ప్రాజెక్టులో పంపుహౌజ్‌కు నీరు అందేటట్లు చూస్తున్నాం. రిజర్వాయర్‌లో నీటి పరిస్థితిపై ఉన్నతాధికారులు కూడా సమీక్షలు జరిపారు.

- రనీల్‌రెడ్డి ఇరిగేషన్ ఏఈ

నీటి కోసం కష్టాలు..



దుప్పల్లిలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. గ్రామానికి పక్కన వాగులోనున్న బోరుబావి ద్వారా నీరు అందేది. అది పూర్తిగా ఎండిపోయింది. మిషన్ భగీరథ నీరు కొంత సేపు వస్తున్నాయి.

- శివశంకర్, మాజీ సర్పంచు దుప్పల్లి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది నామినేషన్లు దాఖలు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సోమవారం పది నామినేషన్లు దాఖలు అయ్యాయి.

మహబూబ్‌నగర్ లోకసభ స్థానంలో నలుగురు అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వారిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున శాంతయ్య, మరొకరు విడతలై చిరుతైగల్ కచ్చి (వీసీకే) పార్టీ అభ్యర్థిగా కె.శంకర్‌రెడ్డి, మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఎస్. సరోజనమ్మ, కె. రామలింగప్పలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. రవినాయక్‌కు తమ నామినేషన్లను దాఖలు చేశారు.

నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ప్రసంగి ఒక సెట్ నామినేషన్ పత్రాలు, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ (ఆదార్ పార్టీ) అభ్యర్థిగా అంబోజు రవి ఒక సెట్ నామినేషన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి తరఫున వారి సతీమణి రాజబన్సీదేవి మల్లు రెండవ సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థిగా ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ రెండవ సెట్ నామినేషన్‌ను, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోతుగంటి రాములు ఒక సెట్ నామినేషన్ పత్రాలు, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోతుగంటి భరత్‌ప్రసాద్ రెండవ సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

తిప్పారెడ్డిపల్లిలో చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ, కేసు నమోదు

వంగూరు ఏప్రిల్ 22 : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం తిప్పారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టెల రాములు, కుటుంబీకులు ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం(పుస్తెలతాడు, కమ్మలు), 75 తులాల వెండితో పాటు, కొంత నగదును అపహరించారు. ఇంటి ముగింట నిద్రిస్తున్న రాములు భార్య మెడలో ఉన్న బంగారు గొలుసును దొంగలు తెంపుకొని వెళ్తుండగా ఆమె మేల్కొని కేకలు వేసింది. దీంతో భర్త లేచి వారి వెంట పడడంతో గొలుసును వదిలి పారిపోయారు. సోమవారం రాములు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం, వ్యక్తి మృతి

కోస్గి రూరల్, ఏప్రిల్ 22 : పందిని తప్పించబోయిన ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా బోగారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూర్ మండలం చింతల్‌దిండెకు చెందిన నవాజ్‌రెడ్డి(41) తన కుమారుడు శివకుమార్‌రెడ్డితో కలిసి సోమవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో బోగారం గ్రామ శివారులో పంది అడ్డు రావడంతో తప్పించబోయి ఇద్దరూ కింద పడ్డారు. నవాజ్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నవాజ్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టైరు ఊడి బస్సును ఢీకొన్న క్రూయిజర్

- ముగ్గురికి గాయాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 22 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మహదేవునిపేట గ్రామ సమీపంలో రన్నింగ్‌లో ఉన్న క్రూయిజర్ టైర్ ఊడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన పది మంది శాయిన్‌పల్లి గ్రామంలోని బంధువుల ఇంట్లో ఓ శుభకార్యం నిమిత్తం సోమవారం నాగర్‌కర్నూల్ నుంచి క్రూయిజర్‌లో బయలుదేరారు. వాహనం మహదేవునిపేట గ్రామ సమీపానికి రాగానే అకస్మాత్తుగా ముందు టైరు ఊడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో క్రూయిజర్‌లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, ఓ మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు

వంగూరు ఏప్రిల్ 22 : కారు అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని వంగూరు గేటు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీశైలం నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు వంగూరు గేటు వద్ద అదుపు తప్పి కాలనీలో బోల్తా పడింది. కారులో భార్యాభర్తలు ఉండగా భార్య తీవ్రంగా గాయపడింది. భర్తకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. వారిని వెంటనే 108లో చికిత్స నిమిత్తం కల్వకుర్తికి తరలించారు. బాధితులు నారాయణపేటకు చెందిన వారని తెలిసింది.

టిప్పర్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 22 : టిప్పర్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన వృద్ధుడు మార్కండేయ సోమవారం శ్రీపురం రోడ్డు నుంచి సైకిల్‌పై వెళ్తుండగా టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నలుగురు వ్యక్తుల బైండోవర్

హన్వాడ, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని అనవసరంగా గొడవలు చేసిన, చేస్తున్న నలుగురిని పోలీసులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. మండల కేంద్రంతో పాటు, మహబూబ్‌నగర్ పరిధిలోని ఎనిమిదితండాకు చెందిన నలుగురిని సోమవారం తహసీల్దార్ కిష్టానాయక్ ముందు పోలీసులు బైండోవర్ చేయగా తహసీల్దార్ వారిని హెచ్చరించారు. మరోసారి గొడవలకు పాల్పడితే, రూ.లక్ష జరిమానా తప్పదని హెచ్చరించి, వారి సంబంధీకుల పూచీకత్తు తీసుకొని నలుగురినీ వదిలేశారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌక్, ఏప్రిల్ 22 : హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు కోసం ఆసక్తి ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీబాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తల్లిదండ్రులను కోల్పోయిన, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన, చిల్డ్రన్స్ హోమ్ సంస్థలోని బాలికలు, దివ్యాంగ బాలికలు, నిరాశ్రయులైన బాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకున్నా, కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని సూచించారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు, వసతి సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. దరఖాస్తు ఫారాలను మే 15వ తేదీలోపు వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్‌లో సమర్పించాలని వివరించారు.

పొగాకు రైతుకు సెగ

- ముందు కొంటామని.. నేడు వద్దంటూ
- వ్యయ ప్రయాసాలకు గురవుతున్న అన్నదాతలు
- హమాలీ పనులను రైతులతో చేయిస్తున్న ఐటీసీ కంపెనీ

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 22 : పొగాకు రైతుకు ప్రైవేటు కంపెనీలు సెగ పెడుతున్నాయి. మొన్నటిదాకా ఉండవల్లి మండల కేంద్రంలో పేరుగాంచిన వీఎస్టీ కంపనీయే పొగాకు కొనుగోలు చేసేది. రెండేళ్ల క్రితం ఐటీసీ, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందు జీపీఐ, అలయాన్స్, డెక్కన్, పీడీపీ అనే ప్రైవేటు టొబాకో కంపెనీలు జిల్లాలోకి ప్రవేశించాయి. ఖరీఫ్ ముందు క్వింటాల్‌కు రూ.16వేల నుంచి రూ.20వేల దాకా కొంటామని రైతులతో నమ్మబలికి వందల ఎకరాల్లో సాగుకు ఉసిగొల్పారు. కంపెనీల మాయమాటలను నమ్మిన రైతులు జిల్లా వ్యాప్తంగా 25వేల ఎకరాల్లో పొగాకును సాగు చేశారు. ఖరీఫ్ పంటలను ఆశాజనకంగా కొన్న కంపెనీలు యాసంగిలో సాగు చేసిన పొగాకు దిగుబడులకు కొర్రీలు పెట్టి వెనక్కు పంపుతున్నాయి. ఇదేమని ప్రశ్నిస్తున్న కంపెనీ బయ్యర్లు రైతులపై చిందులేసి కొనేదిలేదుపో అంటూ బెదిరిస్తున్నారు. మానవపాడు మండలం జల్లాపురం శివారులో కొనుగోలు పాయింట్‌ను ఏర్పాటు చేసిన ఐటీసీ కంపెనీ మొదట్లో అన్నిరకాలు ఉన్న పొగాకును ప్రతీరోజు కొని గత రెండువారాలుగా వారంలో రెండు రోజులు బీట్ పెట్టడమేగాక లేనిపోని పేర్లు పెట్టి రిజెక్ట్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. పైగా రైతుల నుంచి బస్తాకు రూ.20 హమాలీ చార్జీ వసూలు చేయడమే కాకుండా తనిఖీ అనంతరం కింద పారబోసిన పంటను బస్తాలోకి చేర్చి కుట్లు వేసుకునే పనిని రైతులచేత చేయిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే బయ్యర్ హరిసర్వోత్తమరెడ్డి ఇష్టముంటే రండి లేదా బయటకు వెళ్లిపోండని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సరుకు తీసుకెళ్లిన చాలామంది సరుకుకు కొర్రీలు పెట్టి రిజెక్ట్ చేశారు. వారికి అవసరం ఉన్నప్పుడు ఒకలా, అవసరానికి సరిపడా సరుకు చేరాక మరోలా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. సోమవారం ఒక్కరోజే పలు రైతులు తెచ్చిన సుమారు 20 క్వింటాళ్ల పొగాకును రిజెక్ట్ చేశారు.



ఐటీసీ కంపెనీ నిబంధనలను రైతులకు వివరిస్తున్న బయ్యర్ హరిసర్వోత్తమరెడ్డి



కింద పారబోసిన పొగాకును బస్తాలో వేసి కుట్టేసుకుంటున్న మహిళా రైతు

కార్పొరేట్లకు కొమ్ముకాసిన బీజేపీ, బీఆర్ఎస్

- పదేళ్ల నుంచి గత ప్రభుత్వాలు అలాగే బతికాయి
- ధరిత్రి దినోత్సవంలో ప్రజా సంఘాల నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 22 : పదేళ్ల నుంచి కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ బతికాయని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధరిత్రి దినోత్సవం సందర్భంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఫార్మా కంపెనీలు, మైనింగ్, లిక్కర్, ఇథనాల్ ఉత్పత్తులను బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రోత్సహించాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రకృతిని నాశనం చేసే ఇథనాల్ కంపెనీలను తెలంగాణ ప్రాంతంలో 20 పెట్టాలని సన్నద్ధం చేస్తోందన్నారు. నారాయణపేట జిల్లా చిత్తనూర్‌లో పెట్టిన ఇథనాల్ కంపెనీ వలన అక్కడ పంటలు నాశనం అవుతున్నాయని, అంతే కాకుండా గాలి, నీరు కాలుష్యంగా మారి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కంపెనీని ఎత్తివేయాలని వ్యతిరేకించే వారిపై పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనుషులు, జీవులకు మనుగడే ప్రమాదకరంగా మారిన ఇథనాల్ కంపెనీలను తక్షణమే ఎత్తివేయాలని, ప్రజలపై పెట్టిన కేసులను తీసివేసి, ప్రమాదకర కంపెనీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, తిమ్మప్ప, ఎంఆర్‌జేఏసీ నాయకులు హనీఫ్‌అహ్మద్, పి.విజయ్‌కుమార్, జి.గట్టన్న, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టిన ప్రజా సంఘాల నాయకులు

ఉడుకుతున్న పాలమూరు

- జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి, ఇటిక్యాలలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తిఅర్బన్, ఏప్రిల్ 22 : ఎండలు మండుతున్నాయి.. పాలమూరు ఉడుకుతోంది.. భానుడి ప్రతాపానికి జనం అల్లాడుతున్నారు. భరించలేని ఉక్కపోత ఉబ్బరంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సోమవారం నమోదైన ఎండవేడికి తారురోడ్డు కూడా సెగలు కక్కింది. ఫుట్‌పాత్ వ్యాపారుల పరిస్థితి దారుణంగా కనిపించింది.

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి, ఇటిక్యాలలో 43.8, కేటీదొడ్డిలో 43.1, అలంపూర్‌లో 42.5, ధరూర్‌లో 42.3, అయిజలో 42.1, గద్వాలలో 42. ఉండవెల్లిలో 41.1, గట్టులో 40.7, మల్దకల్‌లో 40.5, మానవపాడులో 403, రాజోలిలో 40.3 డిగ్రీలు నమోదు అయ్యింది.

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సీసీకుంటలో 43.3, అడ్డాకుల, మూసాపేటలో 42.6., మిడ్జిల్‌లో 42.5 డిగ్రీలు నమోదుకాగా, మహబూబ్‌నగర్‌లో 40.9, జడ్చర్లలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వనపర్తి జిల్లా పాన్‌గల్ మండంలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నంబావి, ఘనపూర్‌లలో 42.4, పెబ్బేరు 42.2, శ్రీరంగాపురం 42.1, అమరచింత, ఆత్మకూర్‌లలో 41.9, గోపాల్‌పేట 41.8, పెద్దమందడి 41.4, వీపనగండ్ల, కొత్తకోట, మదనాపురంలలో 40.7, వనపర్తి 40.2, రేవల్లి 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. .

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో 42.7, కల్వకుర్తిలో 42.5, పెద్దకొత్తపల్లిలో 41.9, చారకొండలో 41.6, కల్వకుర్తిలో 41.1, నాగర్‌కర్నూల్‌లో 41.0, కొల్లాపూర్‌లో 40.7, బల్మూరులో 40.4, తాడూరులో 40.3, ఊర్కొండలో 40.2, తెల్కపల్లిలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట జిలా నర్వ, కృష్ణలో 40 డిగ్రీలు, మక్తల్‌లో 39, కోస్గి మండలంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ముగిసిన పరీక్షలు.. ఇంటి బాట పట్టిన విద్యార్థులు





పెట్టెలతో బస్టాండ్‌కు వస్తున్న విద్యార్థినులు



బస్టాండ్‌లో బ్యాగులను సరిచూసుకుంటున్న విద్యార్థి

లగేజీతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు





బస్సులోకి సామగ్రిని ఎక్కిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 22 : విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగియడంతో ఇంటి బాట పట్టారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు సోమవారంతో ఎస్ఏ-2 పరీక్షలు ముగిశాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులతో కలిసి ఇంటికి వెళ్లారు. పుస్తకాలు, బ్యాగులతో ఇంటి బాట పట్టిన విద్యార్థులతో పాలమూరు బస్టాండ్ కిటకిటలాడింది. 2023-2024 విద్యా సంవత్సరానికి మంగళవారం చివరి రోజు కానుంది. 24 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ఉన్నాయి. జూన్ 13 నుంచి 2024-2025 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దేవరకద్ర, ఏప్రిల్ 22: రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగారం, పెద్దరాజమూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్‌తో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం తేమ 17శాతం లోగా ఉండాలని, తాలు, మట్టిపెళ్లు, గడ్డిపోచలు లేకుండా శుభ్ర పరిచి, తూర్పారబట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. వారి వెంట ఏవో, ఏఈవోలు, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలబడాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు పోలీసులు అండగా నిలబడాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులపట్ల సానుకూలంగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజలనుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులున్నారన్న నమ్మకం ప్రజల్లో కలిగేలా చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పోలీసులు ప్రజలతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకుని శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించవద్దని హెచ్చరించారు. సామాజిక రుగ్మతలు, సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

మే డేను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, ఏప్రిల్ 22: మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను, ఇతర ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే సందర్భంగా కార్మికుల చట్టాలు, హక్కులు, సంక్షేమం లాంటి సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆసుపత్రిలో కార్మికుల సమస్యలపై కూడా ఈ వేడుకల్లో చర్చా వేదికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, కోటేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్, భీమయ్య, యాదయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ పాలన

- భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ వన్నాడ అంజన్న
- 27న చలో మహబూబ్‌నగర్‌ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వన్నాడ అంజన్న

పాలమూరు, ఏప్రిల్ 22 : బీజేపీ పదేళ్ల పాలనలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పరి పాలన సాగించిందని భారత రాజ్యాంగ పరి రక్షణ సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ వన్నాడ అంజన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్ టీయూ కార్యాలయంలో మీడియా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవటంతోనే దేశాన్ని కాపాడుకుంటామన్నారు. ఈనెల 27న చలో మహబూబ్‌నగర్(జిల్లా కేంద్రంలోని ఎంబీసీ కంపౌండ్)లో నిర్వహించనున్న బ హిరంగ సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులను అణచివేస్తున్న బీజేపీ గుణాన్ని అర్థం చేసుకోవాలన్నారు. మనువాదం వద్దు-మానవీయ సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రజాస్వామిక వాదులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కుల,మతం,రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగాన్ని కాపా డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బహిరంగ సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సభకు ముఖ్య అతిథులుగా యోగేంద్రయాదవ్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కాశీం, దాస్ రాంనాయక్, రెవరెండ్ డాక్టర్ వీపీ ఆశీర్వాదం, బిషప్ డాక్టర్ విల్సన్‌సింగం, అమీర్‌అలీఖాన్, కాచం సత్యనారాయణ హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ ఎం ఖలీల్, కాశపోగు ప్రసాద్, ఇస్లావత్ రవినాయక్, గట్టన్న, జాకీర్‌హుస్సేన్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

- ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు

పాలమూరు,ఏప్రిల్22 : బీజేపీని ఓడించి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం లేవని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.రాంమోహన్ అన్నారు. పదేళ్ల మోదీ కాలంలో మేధావులు, కవులు, కళాకారులకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి తెలిపారు. కార్మికులపై పనిభారం మోపేందుకు 8గంటల పనిదినాలను 12గంటలకు మార్చిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. మోదీ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేట్ విధానాల వల్ల దేశ సంపదను దోచుకున్నారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ అన్నారు. సమావేశంలో నాయకులు చంద్రకాంత్, గణేష్, బాలు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ



బెంచీలను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 22: మండ లంలోని లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2000-01 పూర్వ వి ద్యార్థులు రూ 40,000ల విలువ చేసే బెంచీలు వితరణ చేశారు. ఈ సం దర్భంగా పూర్వ విద్యార్థి వజీర్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలన్న సంకల్పంతో అందరం కలిసి డబ్బు పోగుచేసుకొని బెంచీలు అందించినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ వాగ్దానాన్ని నెరవేరుస్తాం

- ఉమ్మడి జిల్లా లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్‌వే
- డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- పలువురు కాంగ్రెస్‌లో చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల, ఏప్రిల్ 22: కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నెరవేరుస్తామని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలను గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సోమవారం అడ్డాకుల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఈ సందర్భంగా పాలమూరు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్‌కు చెందిన అడ్డాకుల ఎంపీపీ నాగార్జున్ రెడ్డి, కాటవరం మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీరాములు, సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, మూసాపేట మండలం పోల్కంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు సుకన్యరెడ్డి, ఆల యువసేన అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, మూసాపేట డీసీఎం అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జీఎంఆర్ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా జగదీశ్, డీసీసీ కార్య దర్శి విజయమోహన్‌రెడ్డి, గుడిబండ ఎంపీటీసీ సభ్యురాలు శకుంతల, నాయకులు నాగిరెడ్డి, రామన్‌గౌడ్, షఫిహమ్మద్, బాల్‌రాజ్, ఆజం పాల్గొన్నారు.

ప్రజల అండతో సంపూర్ణ అభివృద్ధి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22: మీ ఆశీస్సులు, ప్రజల అండతో మహబూబ్‌నగర్ అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివిటిపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు చెందిన పూజారులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ క్షేమంగా ఉండాలని కోరుకునే మీరు కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. మీ చేరికతో కాంగ్రెస్ పార్టీకి మరింత శక్తి, బలం చేకూరిందన్నారు. భవిష్య త్తులో పూజారుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సత్తూరుచంద్రకుమార్‌గౌడ్, ఏపీ మిథున్‌రెడ్డి, సిరాజ్ ఖాద్రి, చంద్రశేఖర్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ



బాధిత కుటుంబసభ్యులను విచారిస్తున్న వైద్యాధికారులు

మిడ్జిల్, ఏప్రిల్ 22: మండలంలోని వేముల గ్రామానికి చెందిన గర్భిణి విజయలక్ష్మీ మృతిపై సోమవారం డీఎంహెచ్‌వో కృష్ణ, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త అధికారులకు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 28న వేముల గ్రామంలోని తమ పొలం వద్దకు వెళ్లిన విజయలక్ష్మీ గట్టుపై నుంచి జారీ కిందపడిందన్నారు. దాంతో తన భార్యను తల్లిగారి ఊరైన మూసాపేట మండలం పోల్కంపల్లి తీసుకెళ్లినట్లు తెలిపారు. 31న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా వైద్యులు పిండానికి ఇన్ఫెక్షన్ వచ్చిందని, తమ అనుమతితో అబార్షన్ చేశారన్నారు. అనంతరం డిశ్చార్జి అయిన తర్వాత మళ్లీ అదే ఆస్పత్రికి రావడంతో పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 11న మృతి చెందినట్లు వివరించాడు. జిల్లా వైద్యాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు మండల వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. వారి వెంట సీహెచ్‌వో రాము, హెల్త్ అసిస్టెంట్లు జంగయ్య, దేవయ్య ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ టీచర్ ఉన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్

పాలమూరు, ఏప్రిల్22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర వ్యవసాయ విధానం ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. సోమవారం పాలమూరు జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ)మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు ఆంజనేయులు అధ్యతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగం దివాలా తీసిందన్నారు. నయా ఉదారవాద ఆర్థికవిధానాలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలోకి నెట్టబడిందని విమర్శించారు. సీపీఐ వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం(సీపీఐ అనుబంధం)నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యం.గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా జంగయ్య, సహాయ కార్యదర్శిగా ఏటవాలు మాసన్న, సభ్యులుగా బాలనరసయ్య, రామచంద్రయ్య, జంగయ్య, బాలయ్య, సాయిలు, నాగన్న, వెంకటయ్య శేఖర్, కవితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ కమిటీ సభ్యులు పి.సురేష్, డి.రాము, ఆంజనేయులు, జంగమ్మ, మల్లేష్, నరసింహులు, బాలరాజు, మోహన్, శ్రీను, లక్ష్మన్న, శేఖర్, అరుణ్, చిన్నజంగయ్య, శివనాయక్, లక్ష్మణ్‌గీత, రాధాలక్ష్మి పాల్గొన్నారు.

వంశీచంద్‌కు మద్దతుగా గొల్లకురుమల నామినేషన్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డికి మద్దతుగా గొల్లకురుమల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవిగుగులోత్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం గొల్లకాపరుల సహకార సంఘం చైర్మన్ శాంతన్నయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు మద్దతుగా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించే ఉద్దేశంతో నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గొల్లకురుమలకు అండగా ఉన్నదని, అందుకే ఈ ఎన్నికలో తామంతా వంశీచంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, మక్తల్ నుంచి కురుమయాదవనాయకులు రవికుమార్‌యాదవ్, దేవరకద్ర తిరుపతయ్యయాదవ్, జడ్చర్ల అశోక్‌యాదవ్. మాజీజెడ్పీటీసీ నర్సింహులుయాదవ్, వెంకటాద్రి, కురువనరేశ్, కురువ భీమయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



గాయపడిన విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల (మిడ్జిల్), ఏప్రిల్ 22: జడ్చర్ల పట్టణంలోని సోమవారం పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులను ద్విచక్రవాహనం ఢీకొనడంతో చిన్నారులకు గాయాలయ్యాయి. అటు నుంచి వెళ్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తన వాహనాన్ని నిలిపి వేసి విద్యార్థుల దగ్గరకు వెళ్లి వారిని వెంటనే ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి పంపించారు. ఎమ్మెల్యేకు పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- ఓయూ విశ్రాంత ఆచార్యులు ప్రశాంతాత్మ

పాలమూరు యూనివర్సిటీ ఏప్రిల్ 22: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి కేంద్రికరించాలని ఓయూ విశ్రాంత ఆచార్యులు ప్రశాంతాత్మ సూచించారు. సోమవారం పీయూ అకాడమిక్ భవనంలోని సెమినార్‌హాల్ జరిగిన పరిశోధన పద్ధతి, ప్రాజెక్టు నివేదిక అనే అంశంపై జరిగిన వన్డే వర్క్‌షాప్‌కు ముఖ్యవక్తగా ఆమె విచ్చేసి ప్రసంగించారు. పరిశోధన యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. విద్యార్థులు పరిశోధనలు చేస్తే విద్యార్థులకు వారి నిజ జీవితంలో ఆలోచన సరళి, విశ్లేషన శక్తి పెరుగుతుందని అన్నారు. వాణిజ్య రంగంలోని మార్పులకు అనుగుణంగా నూతన అంశాలపై పరిశోధనలు ఏవిధంగా చేయాలో వివరించారు. సమావేశంలో పీయూ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అనురాధరెడ్డి, డాక్టర్ రంగప్ప, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు మాటలకే పరిమితం

- బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు తప్పదు
- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ
- కోయిలకొండ మండలంలో ఎన్నికల ప్రచారం

కోయిలకొండ ఏప్రిల్ 22 : కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు మాటలకే పరిమితమైందని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీ.కే.అరుణ ఆరోపించారు. సోమవారం మండలంలోని మల్కా పూర్, పారుపల్లి, అంకిళ్ల, వింజమూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు తప్పదని హెచ్చరించారు. ప్రపంచ దేశాలలో భారత దేశాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన ప్రధానమంత్రి మోదీతోనే దేశానికి భద్రత అని వెల్లడించారు. అరుణమ్మ పాలమూరు ప్రాంత బిడ్డనేనన్నారు. పాలమూరు అన్ని రంగాల్లో అభి వృద్ధి జరుగాలంటే బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అరుణమ్మకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రా ష్ట్ర నాయకులు నాగూరావు నామాజి , రతంగ్ పాండురెడ్డి, జిల్లా నాయకులు పడాకుల శ్రీనివాస్, అంకిళ్ల చెన్నారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాములుగౌడ్, వెంక ట్రామ్‌రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు. కాగా, హన్వాడ మండల పరిధిలోని హన్వాడ, వేపూర్, పెద్దదర్ పల్లి, భూత్పూర్ మునిసిపాలిటీ పరిధి లోని అమి స్తాపూర్, కౌకుంట్ల, అడ్డాకుల మండల పరిధిలోని రాంచంద్రాపూర్, నవాబ్‌పేట , బాలానగర్ మం డలాల్లో స్థానిక బీజేపీ నాయకులు అరుణమ్మకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బెల్గం ఎమ్మెల్యే అభయ్ పాటిల్

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్: పార్లమెంట్ ఎన్ని కల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేసి మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలిపించాలని కర్ణాటక రాష్ట్రం బెల్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అభయ్ పాటిల్ అన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయం లో మహబూబ్‌నగర్, దేవరకద్ర అసెంబ్లీ నియో జకవర్గాల ముఖ్యనాయకుల సమావేశాన్ని పార్ల మెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్ రెడ్డి అధ్య క్షతన నిర్వహించారు. సమావేశానికి ఆయన ము ఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల కాలంలో పార్టీకి సంబంధించి ఆయా మండలాల లో జరిగిన మండలస్థాయి సమావేశాలలో జరిగిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ఏపీఎన్ రాజు రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేశ్ కుమార్, కొత్తకోట కిరణ్‌కుమార్ రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం విశ్వహిందూ పరిషత్-భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలమూరు పట్టణంలోని రామమందిర్ చౌరస్తాలోని రామాలయం దగ్గర హనుమాన్ విగ్రహానికి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం ఐదు గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రామమందిరం, గడియారం చౌరస్తా, కొత్త బస్టాండ్, న్యూటన్ చౌరస్తా మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు యాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. పట్టణంలో ఉన్న ధార్మిక సంస్థల వారు, కుల సంఘాలవారు దేవాలయం కమిటీ, స్వచ్ఛంద సంస్థ, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

'శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

జడ్చర్ల (మిడ్జిల్), ఏప్రిల్ 22: జడ్చర్ల పట్టణంలోని ఉదయమెమోరియల్ హైస్కూల్‌లో ఆపోపా ఆధ్వర్యంలో 40రోజుల పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ఆంగ్లం, గణితం, భౌతిక, జీవశాస్త్రం 2024-25వ విద్యాసంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆపోపా జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు ఎలిశెట్టి మురళికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ అల్పాహారం అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 23లోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

'కార్మికచట్టాలను కాపాడుకుందాం'

పాలమూరు, ఏప్రిల్ 22 : కార్మికచట్టాలు, హక్కులను కాపాడుకుందామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మే డేను పురస్కరించుకొని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024ఎన్నికల్లో బీజేపీకి గుణ పాఠం చెబుదామన్నారు. కార్యక్రమంలో వి.లక్ష్మణ్, పెంట య్య, చారి, కేశవులు, కృష్ణయ్య, ఖదీర్, పాషా, లక్ష్మయ్య, సీతాచారి, గూడుపాషా, చెన్నమ్మ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలి

భూత్పూర్, ఏప్రిల్ 22: ఓటుహక్కు అనేది ప్రతీ పౌరుడి యొక్క ప్రధాన లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం భూతూర్పు చౌరస్తాలో ఓటు హక్కుపై జిల్లా కేంద్రం నుంచి వచ్చిన కళాకారులతో అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది చాలా ముఖ్యమైదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, మహిళా సంఘాల మహిళలు, సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

● **జడ్చర్ల (మిడ్జిల్):** ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ సొంటి రాజయ్య తెలిపారు. సోమవారం జడ్చర్ల పట్టణంలోని నేతాజిచౌక్, ఇందిరాగాంధీ విగ్రహం, ఫ్లైఓవర్ కూడలిల్లో సెల్ఫీ స్టిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది తదితరులున్నారు.

ఆయిల్ పామ్ తోటలను రక్షించుకోవాలి

పాలమూరు, ఏప్రిల్ 22: వేసవికాలంలో రైతులు కొన్ని మెలకువలు పాటించి ఆయిల్‌పామ్ తోటలను రక్షించుకోవచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి కె.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవికాలంలో 40డిగ్రీల ఉష్ణోగ్రతతో వాతావరణంలో తేమ శాతం తగ్గుతూ వస్తోందన్నారు. పెద్దమొత్తంలో నీరు ఆవిరి కాకుండా కలుపు నుంచి రక్షించుకోవచ్చన్నారు. జిలుగు, జనుము విత్తనాలను ఆయిల్‌పామ్ పాదుల్లో నాటుకోవాల న్నారు. డ్రిప్ సిస్టంతో పాటు ఇదివరకే ఇవ్వబడిన మైక్రో చెట్టు మొక్కకు ఇరువైపులా అమర్చి తడులు ఇచ్చుకోవాలన్నారు.

సదస్సుకు తరలిన మహిళా నాయకులు

మిడ్జిల్, ఏప్రిల్ 22: బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళా నారీశక్తి సదస్సుకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా మోర్చా నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీతోనే దేశ భవిష్యత్ ముందుకు వెళుతుందని గ్రామాల్లోని స్వచ్ఛందంగా మహిళలు సదస్సుకు వస్తున్నారని పలువురు మహిళా మోర్చా నాయకులు తెలిపారు. పలు గ్రామాలకు చెందిన మహిళామోర్చా నాయకులు తదితరులున్నారు.

'ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

పాలమూరు యూనివర్సిటీ, ఏప్రిల్ 22: పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులను, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు డి.రాము మాట్లాడుతూ ఫార్మసీ ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థులు పవన్, లక్ష్మణ్, నాగరాజు, రమేష్, పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు తగవు'

పాలమూరు యూనివర్సిటీ,ఏప్రిల్ 22: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాతపై అసత్య ఆరోపణలు తగవని జిల్లా గిరిజన విద్యార్థి, గోర్‌సేన సంఘల నాయకులు అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీలో కొందరు కాంట్రాక్ట్ అధ్యాపకులు పని గట్టుకోని విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన విద్యార్థి, గోర్‌సేన సంఘల నాయకులు ఛత్రపతి నాయక్, చందు చౌహన్,రవినాయక్,మోహన్ నాయక్, మహేష్ నాయక్,సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

మిడ్జిల్, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని మంగళవారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీపీ సుదర్శన్ కోరారు.సోమవారం మండలకేంద్రంలోని ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, నారాయణ్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మతీన్, ప్రతాప్‌రెడ్డి, భీంరాజు, బంగారు, శ్రీను, జైపాల్‌రెడ్డి, నవీన్‌చారీ, నిరంజన్, మంగళి నర్సింహ, లక్ష్మణ్‌నాయక్, తిరుపతినాయక్, శేఖర్‌గౌడ్, రేణయ్య, నరేష్‌గౌడ్, నరేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పాలమూరు పార్లమెంట్ బరిలో బీఎస్పీ

- ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు

మహబూబ్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 22: పాలమూరు పార్లమెంట్ బరిలో బహుజన సమాజ్ పార్టీ బరిలో నిలుస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం బీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల 24న పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి దార రాంచంద్రయ్య, దేవరకద్ర, జడ్చర్ల ఇన్‌చార్జిలు సంతోష్ రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.